క్లుప్తంగా

సొసైటీ ద్వారా ఎరువుల పంపిణీ



పాల్తూరు సొసైటీలో ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

విడపనకల్లు: విడపనకల్లు రైతు సహకార సంఘం కేంద్రం ద్వారా మండలంలోని పాల్తూరు గ్రామంలో గురువారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. పాల్తూరు సొసైటీ గోడౌన్‌లో 24 మెట్రిక్ టన్నుల యూరియా,ఆర్‌బీకే కాంప్లెక్స్ ఎరువులు10 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని ఏఓ పెన్నయ్య తెలిపారు. అలాగే మండలవ్యాప్తంగా 18 ఆర్‌బీకేల్లో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ సూచించారు. సొసైటీ సీఈఓ ఎర్రిస్వామి, సొసైటీ చైర్మన్ బోయ శ్రీరాములు, సేల్స్ మ్యాన్ ఈశ్వరప్ప, ఎంపీఈఓ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ జేఏసీ నూతన కమిటీ ఎన్నిక

కంబదూరు: మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా డాబా రమేష్, ఉపాధ్యక్షులుగా కురాకులపల్లి గోపాల్, జెక్కిరెడ్డిపల్లి నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా ఒంటారెడ్డిపల్లి నాగరాజు, కార్యదర్శులుగా బాలు, నాగరాజు, గురు, యువజన అధ్యక్షుడిగా హరి, సభ్యులుగా తిమ్మన్న, రామాంజినేయులు ఎన్నికయ్యారు అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతామన్నారు.

సర్మస్ హుసేన్సీ దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థ ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణంలో కందూరీలు చేశారు.

సమస్యలు పరిష్కరించండి



భైరవానితిప్ప సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటనాయుడు

బ్రహ్మసముద్రం: ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంపీడీఓ వెంకట నాయుడు ఆదేశించారు. గురువారం మండలంలోని భైరవానితిప్ప, భైరసముద్రం గ్రామ సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులతో పాటు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయడంతో పాటు సమయ పాలయ పాటించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరాదిమఠం పీఠాధిపతికి స్వాగతం



రాయదుర్గంలోని ఉత్తరమఠంలో మొక్కులు తీర్చుకుంటున్న సత్యాత్మతీర్థ స్వామీజీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఉత్తర మఠాన్ని గురువారం ఉత్తరమఠం (బెంగళూరు) పీఠాధిపతులు సత్యాత్మతీర్థ స్వామిజీ సందర్శించారు. రాయదుర్గంలో జరుగుతున్న ఉత్తర మఠం భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. బళ్లారి నుంచి విచ్చేసిన ఆయనకు గురువారం సాయంత్రం బ్రాహ్మణులందరూ ఘన స్వాగతం పలికారు. ఉత్తర మఠంలో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా సత్యాత్మతీర్థ స్వామిజీని భక్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

పంటకు కాపాలా.. మైకులు, చీరలు!



బోరంపల్లిలో రైతు సుధాకర్‌రెడ్డి తన పొలంలో ఏర్పాటు చేసుకున్న మైకు



కదిరంపల్లిలో పంట పొలం చుట్టూ రక్షణగా చీరల తెరలను ఏర్పాటు చేసిన దృశ్యం

కళ్యాణదుర్గం: ఒకప్పుడు ఉద్యాన పంటల సాగు చేసిన రైతులు అడవి జంతువుల నుంచి కాపాడుకునేందుకు రేయింబవళ్లు పొలాల్లో కాపలా ఉండాల్సిన పరిస్థితి. పంటలకు కాపలా వెళ్లే సమయంలో అనేక మంది రైతులు పాము కాటుకు గురై మరణించడం....అడవి జంతువుల బారిన పడి గాయపడటం తదితర సంఘటనలు చాలానే ఉన్నాయి. దీంతో పంటలు కాపాడుకునేందుకు రైతన్నలు కొత్త కొత్త ఆలోచనలతో వినూత్న ప్రయోగాలు చేస్తున్నారు. రైతులు పొలాల్లో మైకులు ఏర్పాటు చేసి.. హుచ్.... హో....అంటూ డప్పుల శబ్దం.. మేలం శబ్దం.. వచ్చేలా వివిధ శబ్దాలతో పాటు పాటలను పెడుతున్నారు. కరెంటు ఉన్నప్పుడు కరెంటుతో....కరెంటు లేనప్పుడు బ్యాటరీతో మైకులు పనిచేసేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో అడవి జంతువులు అటుగా వచ్చినా.. కాపలా ఉన్నారనుకుని పంటపై దాడి చేయకుండా వెనుతిరుగుతున్నాయి. ఒక్కో మైకుకు సుమారు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు ఖర్చు చేస్తున్నారు. విద్యుత్ సాయంతో ఒక చోట విద్యుత్ స్తంభానికి మైకులను ఏర్పాటు చేసి హుచ్....హో....అంటూ డప్పుల శబ్దం....మేలం శబ్దం....వచ్చేలా వివిధ శబ్దాలతో పాటు పాటలను పెడుతున్నారు. కరెంటు ఉన్నప్పుడు కరెంటుతో....కరెంటు లేనప్పుడు బ్యాటరీతో మైకులు పనిచేసేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు ఆర్థిక స్తోమత లేని రైతులు పంట చుట్టూ పాత చీరలను తెరలా కంచెలా ఏర్పాటు చేసుకుంటున్నారు. గాలికి చీరల నుంచి వచ్చే శబ్దంతో కరెంటు తీగలు అమర్చినట్లు వినపడటంతో అడవి జంతువులు పంటలను దెబ్బతీయకుండా వెనుతిరుగుతున్నాయి.

అశ్వవాహనంపై వేంకటరమణుడు



మొక్కులు తీర్చుకుంటున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు

రాయదుర్గంటౌన్: ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీవారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శ్రీవారి ఆలయం నుంచి కోట మీదుగా వినాయక సర్కిల్, పాతబస్టాండ్ మీదుగా లక్ష్మీబజార్‌కు వరకూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బాణాసంచా వేడుక చేపట్టారు. దారి పొడవున భక్తులు శ్రీవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రథాన్ని లాగిన విప్

స్వామి అశ్వ వాహనోత్సవానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, భారతి దంపతులు హాజరై రథాన్ని లాగారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌని ఉపేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ నాగరాజురెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి, అరె కటిక, నాయీబ్రాహ్మణ, రజక సంఘాల సభ్యులు గరుడసేవలో పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం స్వామి మయూర వాహనోత్సవం నిర్వహించనున్నారు.

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ



పెన్నహోబిలంలో ఉద్భవలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ ఆలయ దిగువ భాగంలోని ఉద్భవలక్ష్మి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈఓ కె. విజయ్‌కుమార్‌తో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు పది రోజుల ముందు పురాతన రథం కిందపడిపోవడంపై ఎమ్మెల్సీ అసంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల నుంచి రూ. 85 లక్షల దాకా విరాళాలు వసూలు అయినప్పటికీ కొత్త రథం నిర్మాణానికి ఇప్పటి వరకు టెండర్లు పిలువకపోవడంలో అధికారుల అలసత్వం కనిపిస్తోందన్నారు. రథం నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేట్లను త్వరతిగతిన సిద్ధం చేస్తే.. ప్రభుత్వ పెద్దలతో చర్చించి వచ్చే ఏడాదికి రథం పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు హనుమంతు, ఎర్రిస్వామి, అర్జునప్ప తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం వద్దు



తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ రూరల్: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బందికి ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి సూచించారు. ఉరవకొండలో పది రోజులుగా తాగునీరు సక్రమంగా రాక సమస్య నెలకొందని పలువురు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం మధ్యాహ్నం స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాకు కలుగుతున్న ఆటంకాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యాన్నిపలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది కలసికట్టుగా పనిచేసి తాగునీటి సమస్య తలెత్తకుండా కృషిచేయాలన్నారు. జలజీవన్ మిషన్, పీఏబీఆర్, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం, నింబగల్లు ఎస్ఎస్ ట్యాంకు తదితర ప్రాజెక్టుల పనితీరుపై చర్చించారు. తాగునీటి పంపింగ్ జరుగుతున్న సమయంలో విద్యుత్‌శాఖ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేస్తుండడంతో సమస్య ఎక్కువగా తలెత్తుతుందని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జిల్లా విద్యుత్‌శాఖ అధికారులుతో చర్చించి కరెంట్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మరోసారి పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ పార్వతమ్మ, ఏఈ ఫామిదా, జేటీఓ ద్రాక్షాయని, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్, పార్టీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, జలజీవన్ సూపర్‌వైజర్ పరమేష్, బాబూనాయక్, కోఆప్షన్ మెంబర్ సలీం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ అందజేస్తాం



సమావేశానికి హాజరైన అధికారులు

కుందుర్పి: ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ అందజేస్తామని ఏడీఏ యల్లప్ప సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి విత్తన వేరుశనగ అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అప్పిలేపల్లి పంచాయతీని ఎనుములదొడ్డి పీహెచ్‌సీకి కాకుండా కుందుర్పి పీహెచ్‌సీలో కలపాలని సర్పంచ్ అతావుల్లా కోరారు. జంబుగుంపల పంచాయతీలో కొలిమిపాళ్యం, కెంచంపల్లి, కలిగొలిమి గ్రామాల మధ్య దెబ్బతిన్న మోరీలను మరమ్మత్తులు చేయాలని ఎంపీపీ కమలమ్మ అధికారులకు సూచించారు. బెస్తరపల్లి-జంబుగుంపల రోడ్డును మరమ్మతు చేయాలని సర్పంచ్ మమత కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాస్వామి, వైస్ ఎంపీపీలు బీజప్ప, శ్రీలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ నారాయణస్వామి, ఏఓ మహేష్, అధికారులు, ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

‘ఆర్టీటీ సెట్’ సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఏటీఎల్ మీనాక్షి

కళ్యాణదుర్గం: పదో తరగతిలో 500 పైన మార్కులు సాధించిన పేద విద్యార్థులు ఆర్టీటీ సెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏటీఎల్ మీనాక్షి సూచించారు. స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో గురువారం పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 500 పైబడి మార్కులు సాధించిన వారికి ఆర్డీటీ సెట్ దరఖాస్తు చేయించుకున్నారు. సంస్థ నిబంధనల మేరకు అర్హులైన వారికి ఉన్నత విద్య కోసం అవకాశం కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల విద్యార్థులు దరఖాస్తులు సమర్పించారు.

శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి తరలిరండి



శ్రీలక్ష్మీ మహాయజ్ఞం పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ మహాయజ్ఞానికి తరలిరావాలని ఇన్‌చార్జి ఈఓ బాబు కోరారు. గురువారం మండలంలోని సంగమేశ్వర దేవాలయం వద్ద మహాయజ్ఞం పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసిలాయనవిడుదల చేశారు. ఈఓ మాట్లాడుతూ ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అష్టోత్తర శతకుండాత్మక (108) , చండీ , రుద్ర, రాజశ్యామల, సుదర్శనసహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్ కృష్ణ, నాయకులు ప్రసాద్‌రెడ్డి, వన్నూరుస్వామి, రంగారెడ్డి, చంద్ర, కృష్ణ, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.

15న పాండురంగస్వామి రథోత్సవం



అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి



ప్రారంభోత్సవానికి సిద్ధంగా అన్నసత్ర భవనం

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం ఈనెల 15న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు మెట్టు హనుమంతరెడ్డి తెలిపారు. 15న సోమవారం వైశాఖమాసం బహుళ ఏకాదశి సందర్భంగా ఉదయం రుక్మిణీ పాండురంగస్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పల్లకీ మహోత్సవం చేపట్టనున్నారు. అలాగే స్వామి రథాన్ని ఆలయం నుంచి ప్రధాన వీధిలోని ఎదురు బసవణ్ణ దేవాలయం వరకు లాగుతామన్నారు. పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం రథోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి హాజరవుతారన్నారు. అలాగే పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ చేతుల మీదుగా భక్తులు పాండురంగస్వామి మాలధారణ చేపట్టవచ్చన్నారు. రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే నూతన అన్న సత్న భవనాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తదితరులు

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గద్దెగ లింగేశ్వరతుప్పద మాళ మల్లేశ్వరస్వామి దేవాలయంలో గురువారం మాళా మల్లేశ్వరస్వామి, కరిమాళవీదేవి, విఘ్నేశ్వర, సుబ్రమణ్యేశ్వరస్వామి, షిరిడీ సాయిబాబా, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అలాగే కాశీ నుంచి తెప్పించిన శివలింగాలను ప్రతిష్టించారు. కొనకొండ్ల, పెద్దానుపల్లి, గూళ్యపాళ్యం, గుంతకల్లు తదితర గ్రామాలకు చెందిన అల్యాల గోత్ర గోరవ వంశీయులు, బెళగోణ రామనాథశాస్త్రి తదితరుల ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. వేడుకలకు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జరుట్లరామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

వజ్రకరూరు మండలంలోని జరుట్ల రాంపురంలో గురువారం సాయంత్రం రామలింగేశ్వరస్వామిని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలి



చిత్ర లేఖనంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

కూడేరు: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని గ్రంథాలయాధికారిణి రాధారాణి సూచించారు. సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్‌పై శిక్షణ ఇచ్చారు. ఏకాగ్రతతో పని చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రంగయ్య, పాఠకులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

27న మార్కెట్ గదుల వేలం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ పైఅంతస్తులోని కాంప్లెక్స్‌లో నిర్మించిన 42 గదుల అద్దెకు ఈ నెల 27న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో బహిరంగ వేలం వేస్తామని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సమగ్ర చిన్న, మధ్య తరహా పట్టణాభివృద్ధి పథకం కింద షాపులు నిర్మించామన్నారు. పైఅంతస్తులోని ఏ, బీ బ్లాక్‌లలో 42 గదులు ఉన్నాయన్నారు. వేలంలో గదులు దక్కించుకున్న వారికి గుడ్‌విల్ అమౌంట్ వాపసు ఇవ్వబడదన్నారు. ఆసక్తి గల వారు నిబంధనల మేరకు గుడ్‌విల్ అమౌంట్, సాల్వెన్సీ సర్టిఫికెట్లను సమర్పించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. ఏ బ్లాక్‌లో రెండు పెద్ద హాళ్లు, 15 గదులు, బీ బ్లాక్‌లో 25 గదులు ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగంలో సంప్రదించాలన్నారు.

కణేకల్లులో భారీ వర్షం

కణేకల్లు: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కణేకల్లు, మాల్యం, సొల్లాపురం, ఎస్.హనుమాపురం, తుంబిగనూరు, గరుడచేడు, మీన్లహళ్లి తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. తొండపాడు గ్రామానికి చెందిన సుంకప్ప తన మనుమరాలు మానవి కుల ధ్రువీకరణ పత్రం కోసం అభిరామ్, గంగోత్రి, లక్ష్మీదేవి, శ్రావణి, కార్తిక్‌తో కలిసి ఆటోలో గుత్తికి వచ్చారు. పని ముగించుకుని తిరిగి తొండపాడుకు వెళ్తుండగా కొత్తపేట సమీపంలో వేగంగా వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేటి నుంచి అఖండ రామభజన

అనంతపురం కల్చరల్: హౌసింగ్ బోర్డు భక్తాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు వైభవంగా హనుమద్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పరుచూరి రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆలయంలో జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 12న ఉదయం 6 గంటల నుంచి 13న ఉదయం 6 గంటల వరకు అఖండ రామభజన ఉంటుందన్నారు. 13న ఉదయం 108 మంది దంపతులతో సామూహిక హనుమద్ వ్రతాలు, సాయంత్రం 1000 మందితో హనుమాన్ చాలీసా పఠనం జరుగుతాయి. 14న నిలువెత్తు మూలవిరాట్‌కు మహాపంచామృతాభిషేకాలు, మహా సుదర్శన హోమం, పూర్ణాహుతి జరుగుతాయని తెలిపారు.

రూ.3.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం





పి.నారాయణపురం వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కూడేరు: మండలంలోని పి.నారాయణపురం వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.3.5 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మిస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ గౌస్ గురువారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయితే జయపురం, చోళసముద్రం, పి.నారాయణపురం, తిమ్మాపురం, కరుట్లపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో లోఓల్టేజీ సమస్య ఉండదన్నారు. అలాగే వ్యవసాయానికి 9 గంటలు పాటు నిరంతరం విద్యుత్ సరఫరా చేయవచ్చన్నారు.

14న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ట

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో ఈ నెల 14 ముత్యాలమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గ్రామపెద్దలు గురువారం తెలిపారు.శుక్రవారం ఆలయం వద్ద కలశ స్థాపన, కలశ పూజ , మహామంగళహారతి ఉంటుందన్నారు. 13న నవగ్రహ హోమం, ప్రతిష్ట విగ్రహ మూలమంత్ర హోమం, సాయంత్రం అమ్మవారి విగ్రహం ఊరేగిస్తామన్నారు. 14న ఉదయం 8 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, అన్నదానం ఉంటుందన్నారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ జి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.150 ఫీజుతో 25వ తేదీలోపు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జూన్ 11వ తేదీ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్/ఏపీఎంఎస్(ఆన్‌లైన్) పోర్టల్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

హరిజన మహాసభ విజయవంతం చేయండి

విడపనకల్లు: ఉరవకొండలో ఈనెల 15న గాంధీ హరిజన హాస్టల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు మీనుగ గోపాల్, ఆనందురాజు, చాబాల సర్పంచు జగదీష్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ హరిజన హాస్టల్‌కు సంబంధించిన స్థలం 1.98 ఎకరాలను కబ్జా కాకుండా హరిజనులంతా కాపాడుకోవాలన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో కోనాపురం ఎర్రిస్వామి, వంకాల గోవిందు, బండారు రాజేష్, వరప్రసాద్, దివాకర్, చౌడికి గంగన్న, చీకలగురికి ఓబుళేసు, ఎల్లన్న, సుభాష్, వెంకటేశులు, రాకెట్ల శ్రీరాములు, ఆనందు, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.